# సాక్షి సిద్దిపేట

బుధవారం । 16 । ఆగస్టు । 2023




సిద్దిపేట కమాన్: సీపీ కార్యాలయంలో వందనం చేస్తున్న అదనపు డీసీపీ శ్రీనివాసరావు



మల్లకంబ విన్యాసాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు, చిత్రంలో మంత్రి హరీశ్‌రావు

## మురిసిన మువ్వన్నెలు

- సంబురంగా స్వాతంత్ర్య వేడుకలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



సిద్దిపేట ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థినుల నృత్యప్రదర్శన

సిద్దిపేటకమాన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. మంత్రి హరీశ్‌రావు పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ప్రత్యేక వాహనంలో మంత్రి ప్రజలకు, విద్యార్థులకు అభివాదం చేస్తూ పరేడ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా సాతంత్ర్య సమరయోధులను మంత్రి సన్మానించారు. న్యూట్రీషియన్ కిట్లను గర్భిణులకు అందజేశారు. మైదానంలో విద్యార్థులు నృత్యాలతో, ఆట పాటలతో అలరించారు. రాఘవాపూర్ కేజీబీవీ, సిద్దిపేట బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రాఘవాపూర్ విద్యార్థులు చేసిన మల్లకంబ విన్యాసాలు అబ్బురపరిచాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీష్‌కుమార్, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, సీపీ శ్వేత, అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్, శ్రీనివాసరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ రోజరాధాకృష్ణశర్మ, మున్సిపల్ చైర్మన్ కడవెర్గు మంజులరాజనర్సు, అదనపు డీసీపీ అడ్మిన్ శ్రీనివాసరావు, ఏసీపీ కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ధరణికుమార్, డీఎంహెచ్‌ఓ కాశీనాథ్, ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని నృత్య ప్రదర్శన

# కాళేశ్వరం పారింది.. ప్రగతి విరిసింది

**అభివృద్ధి బాటన పల్లెలు, పట్టణాలు**

- 81,565 మందికి రూ.418 కోట్ల రుణమాఫీ
- సిద్దిపేటకు త్వరలో చుక్‌చుక్ రైలు
- స్థానికంగానే సాఫ్ట్‌వేర్ కొలువులు
- వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు
- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన మంత్రి



సాక్షి,సిద్దిపేట: 'తెలంగాణ ఉద్యమానికి ట్యాగ్‌లైన్‌గా చెప్పుకున్న నీళ్లు, నిధులు, నియామకాలను సాకారం చేసుకున్నాం.. అదే మార్గంలో సిద్దిపేట ట్యాగ్‌లైన్‌గా భావించిన జిల్లా ఏర్పాటు, గోదావరి జలాలు సాధించుకున్నామం.. త్వరలో రైలు కూత కూడా వినిపించబోతోంద'ని రాష్ట్ర ఆర్థిక వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు అన్నారు. సిద్దిపేట డిగ్రీ కళాశాల మైదానంలో మంగళవారం జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. మంత్రి హరీశ్ రావు మాట్లాడారు.

**జిల్లాలో రూ418 కోట్ల రుణమాఫీ**

వ్యవసాయం దండగ కాదు పండగ అని ప్రతీరైతు కళ్లలో సంతోషాన్ని నింపుతున్నది కేసీఆర్ ప్రభుత్వమని మంత్రి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో గోదావరి జలాలను గ్రామ గ్రామాన పారించుకుంటున్నామన్నారు. రిజర్వాయర్లు నిర్మించడంతో భూగర్భ జలాలు ఘననీయంగా పెరిగాయని, ఆయిల్‌పామ్ సాగుకు అనుకూల వాతావరణం ఏర్పడిందన్నారు. జిల్లాలో 81,565 మందికి రూ.418 కోట్లు రుణ మాఫీ అయిందన్నారు. రైతు బీమాతో 4,736 రైతు కుటుంబాలకు రూ.236.80కోట్లను అందించి కేసీఆర్ అండగా నిలిచారన్నారు.

**త్వరలోనే మల్లన్న జలాలు**

2014 సంవత్సరానికి ముందు జిల్లాలో కేవలం 4,400 నల్లా కనెక్షన్లు ఉండగా.. మిషన్ భగీరథ ద్వారా 2.32లక్షల నల్లా కనెక్షన్లతో ఇంటింటికీ స్వచ్ఛమైన నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. త్వరలోనే మల్లన్నసాగర్ నుంచి సిద్దిపేట ప్రాంతానికి గోదావరి జలాలను తరలిస్తామన్నారు.

**కులవృత్తులకు ప్రోత్సాహం**

గొల్లకుర్మలకు ప్రభుత్వ సబ్సిడీతో ఇప్పటికే 15,720 మందికి గొర్రెలను అందజేశామని, రెండో విడతలో మరో 17వేల మందికి పంపిణీ జరుగుతుందని మంత్రి తెలిపారు. 281 మత్స్యపారిశ్రామిక సహకార సంఘాలకు చెందిన 20,350 మంది జీవనోపాధి పొందుతున్నారు. రిజర్వాయర్లు, చెరువుల్లో 3.92కోట్ల చేప పిల్లలను వదలగా రికార్డు స్థాయిలో 18,700 టన్నుల చేపల దిగుబడి వచ్చిందన్నారు. నాయీబ్రాహ్మణులు, రజకులను ప్రోత్సహించడంతో స్వయం ఉపాధి పెరిగిందని చెప్పారు.

**మార్కెటింగ్ వ్యవస్థ పటిష్టం**

పంటలు పండించడంలోనే కాదు. దిగుబడులను విక్రయించడంలోనూ మార్కెటింగ్ వ్యవస్థను పటిష్టంగా ఉందన్నారు మంత్రి హరీశ్‌రావు. సిద్దిపేట, గజ్వేల్‌లో మోడల్ రైతు బజార్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సిద్దిపేటలో రూ.25కోట్లతో మరో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. రవాణా వ్యవస్థ మెరుగుపడితేనే ప్రజల జీవనప్రమాణాలు కూడా పెరుగుతాయనే ఆలోచనతో రహదారుల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు.

**చుక్‌చుక్ రైలు వస్తోంది..**

జిల్లా ఆవిర్భవించడంతో మొదటి హామీ పరిష్కారం కాగా.. రెండో ఆకాంక్ష కాళేశ్వరం ప్రాజెక్టుతో గోదావరి జలాలు పరవళ్లు తొక్కుతున్నాయని చెప్పారు. ఇక రైలు సౌకర్యం ఒక్కటే మిగిలి ఉంది. ఇప్పటికే సిద్దిపేట రైల్వేస్టేషన్ వరకు ట్రాక్ నిర్మాణం పూర్తికావొచ్చిందన్నారు.

**తొలిసారిగా రుతుప్రేమ**

కార్పొరేట్‌కు దీటుగా సర్కారు ఆస్పత్రులను తీర్చిదిద్దినట్లు చెప్పారు. దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా రుతుప్రేమ కార్యక్రమాన్ని మన సిద్దిపేటలో శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. మహిళల ఆరోగ్య సంరక్షణ కోసం నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలకు మంచి స్పందన వస్తుందన్నారు.



జాతీయజెండాకు వందనం చేస్తున్న మంత్రి హరీశ్‌రావు, కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్, జెడ్పీ చైర్‌పర్సన్



కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లిలో 800 అడుగుల జాతీయ పతాకంతో ర్యాలీ



మహిళా సంఘాలకు రుణాల చెక్కును అందజేస్తున్న మంత్రి హరీశ్‌రావు



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి

## యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

- ఐటీ హబ్‌తో నాకల నెరవేరింది
- టాస్క్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి
- ఐటీ హబ్ వెబ్‌సైట్ ప్రారంభం
- మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటఅర్బన్: ఐటీ హబ్ ద్వారా స్థానిక నిరుద్యోగ యువతకు 1500 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, సిద్దిపేటకు ఐటీ హబ్ రావాలన్న తన కల నెరవేరడం సంతోషంగా ఉందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంగళవారం ఐటీ హబ్ వద్ద వెబ్‌సైట్‌ను ఎమ్మెల్యే సతీశ్, ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డి, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఫేజ్–1 పూర్తికాగానే ఫేజ్–2 ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఐటీ టవర్ లో టాస్క్ ద్వారా శిక్షణ తరగతులు చక్కగా జరుగుతున్నాయని, యువత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సిద్దిపేటలో సొంతంగా ఐటీ టవర్ పెట్టాలని అనుకునే వారికి కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు కావాల్సిన అనువైన స్థలాన్ని ఇస్తామని ఐటీ పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఇటీవల 7 కంపెనీలు నిర్వహించిన జాబ్ మేళాలో ఎంపికైన ఉద్యోగులకు జాబ్ ఆఫర్ లెటర్స్ అందించారు.

**మంత్రికి కృతజ్ఞతలు**

మాది సిద్దిపేట పట్టణంలోని గణేశ్ నగర్. నాకు ఇటీవల సిద్దిపేట ఐటీ హబ్‌లో ఉద్యోగం లభించింది. సొంత ఊరిలోనే ఐటీ ఉద్యోగం రావడం సంతోషంగా ఉంది. స్థానికంగా ఐటీ ఉద్యోగం చేసే అవకాశం కలిగేలా ఐటీ హబ్‌ను సిద్దిపేటలో ఏర్పాటు చేయించిన మంత్రి హరీశ్ రావుకు స్పెషల్ థాంక్స్. – యోగిత

## న్యూస్‌రీల్

### పోలీసులపై రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు తగవు

**జిల్లా పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి**

సిద్దిపేటకమాన్: హైదరాబాద్ గాంధీభవన్‌లో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పోలీసులపై చేసిన అనుచిత వాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని జిల్లా పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రవీందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలీసులు ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండి తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్నా మనోభావాలను దెబ్బతీసేవిధంగా మాట్లాడడం సరికాదన్నారు. శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీసులు విధులు నిర్వహిస్తున్నారన్నారు.

### జైలు హెడ్ వార్డర్‌కు రాష్ట్రపతి సేవా పతకం



జైళ్ల శాఖ డీజీ జితేందర్ నుంచి సేవా పతకం అందుకుంటున్న మల్లారెడ్డి

సిద్దిపేటకమాన్: జిల్లా జైలులో హెడ్ వార్డర్‌గా విధులు నిర్వహిస్తున్న జి.మల్లారెడ్డి రాష్ట్రపతి సేవా పతకానికి ఎంపికయ్యారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో జైళ్ల శాఖ డీజీ జితేందర్ పతకాన్ని అందుకున్నారు. మల్లారెడ్డి 1994 సంవత్సరం సికింద్రాబాద్‌లో మొదటి పోస్టింగ్‌లో చేరారు. ఇతడి స్వగ్రామం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం పీచుపల్లి. 2016లో సిద్దిపేటకు బదిలీపై వచ్చి ప్రస్తుతం జిల్లా జైలు హెడ్ వార్డర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ చూపినందుకు పతకానికి ఎంపికయ్యారు.

### రేపు జాబ్‌మేళా

సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డి పట్టణంలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో గురువారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సెర్ప్ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు ఉంటాయని, విద్యార్హత జిరాక్స్ కాపీలు ఆధార్ కార్డు, రేషన్ కార్డ్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో హాజరు కావాలని కోరారు.

## ఉత్తమ సేవలకు పురస్కారాలు

సంగారెడ్డి మున్సిపాలిటీ: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా పోలీస్ శాఖలోని వివిధ విభాగాల్లో ఉత్తమ సేవలు అందించిన పలువురు అధికారులకు హోంమంత్రి మహమూద్‌అలీ మంగళవారం సర్టిఫికెట్లు అందజేశారు.

**అవార్డు అందుకున్న వార్డెన్..**

మనూరు(నారాయణఖేడ్): మనూరులోని సాంఘీక సంక్షేమ హాస్టల్ వార్డన్ రాజిరెడ్డి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో హోంమంత్రి మహమూద్ అలీ, కలెక్టర్ శరత్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. విధి నిర్వహణలో అందరికి ఆదర్శంగా నిలిచిన వార్డెన్ రాజిరెడ్డిని పలువురు అభినందించారు.

**డ్రైవర్లకు అవార్డులు**

నారాయణఖేడ్: ఇంధన పొదుపునకు సంబంధించి డ్రైవర్లు బీరయ్య ప్రథమ స్థానంలో, కిషన్ ద్వితీయ స్థానంలో నిలిచినందునా స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం డీఎం మల్లేశయ్య సన్మానించి అవార్డులతో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం పట్టణంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మూడు చోట్ల బస్సుషెల్టర్లు ఏర్పాటు చేసినందుకు మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనా నజీబ్, కమిషనరు మల్లారెడ్డికి డీఎం కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన రిటైర్డ్ ఆర్మీ అధికారి దత్తురావు పటేల్‌ను ప్రయాణికులకు సేవల్లో విశిష్టంగా కృషి చేస్తున్నందుకు గాను ఆర్టీసీ పీఆర్వో పాండును డీఎం మల్లేశయ్య సన్మానించారు.

## అన్ని వసతులతో మార్కెట్ నిర్మాణం

హవేళీఘనపూర్: మెదక్ మండల పరిధిలోని కొంటూర్ చెరువు వద్ద మత్స్యకారులు చేపలు విక్రయించుకునేందుకు 10గుంటల స్థలంలో మార్కెట్ కమిటీ భవన నిర్మాణం చేపట్టనున్నట్లు మంత్రి తలసాని తెలిపారు. రూ.50లక్షల నిధులతో అన్ని వసతులతో చేపట్టనున్న భవానికి శంకుస్థాపన చేశారు. వృత్తిని కాపాడుకుంటూ ఉపాధి అవకాశాలు పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం అర్హత కలిగిన 200 మంది మత్స్యకారులకు గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి కోరగా అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు.



మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



జాతీయ జెండా రంగుల్లో ఏడుపాయల దుర్గమ్మ

### మువ్వన్నెల వనదుర్గ

స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని ఏడుపాయల వన దుర్గమ్మను మంగళవారం మూడు రంగుల పుష్పాలతో అలంకరించారు. ఎరుపు రంగు బంతి పూలు, మధ్యలో తెలుపు చామంతి, కింద ఆకుపచ్చ నాచుతో జాతీయ జెండా రంగులో తీర్చిదిద్ది ప్రత్యేక పూజలు చేశారు. గర్భగుడిలో భరత మాతను తలపిస్తున్న దుర్గమ్మ అలంకరణను చూసి భక్తజనులు మురిసిపోయారు.

– పాపన్నపేట(మెదక్)

## సీత్లా... సంబురంగా..



నైవేద్యాలతో తరలివస్తున్న గిరిజన మహిళలు

అక్కన్నపేట(హుస్నాబాద్): గిరిజనులు సీత్లా పండుగను వైభవంగా నిర్వహించారు. అక్కన్నపేట మండలం కుందనవానిపల్లి పంచాయతీ చౌటకుంటతండా, సీతారాంతండాల్లో మంగళవారం సీత్లా భవానీ వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. మహిళలు బోనాలతో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.చల్లంగా చూడాలంటూ వేడుకున్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మాలోతు నరసింహానాయక్, నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డెక్కిన దళితులు

- దళితబంధు అందరికీ ఇవ్వాలని డిమాండ్
- మునిగడపలో ధర్నా
- నిర్మల్‌నగర్‌లో కొనసాగుతున్న నిరసనలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): దళితులందరికీ దళితబంధు అందించాలని దళితులు రోడ్డెక్కారు. మంగళవారం మండలంలోని మునిగడప గ్రామంలో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి ధర్నాలో పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ దళితబంధు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. ఎన్నికల వేళ ఆ బంధు.. ఈ బంధు అంటూ ప్రజల మధ్య చిచ్చుపెడుతున్నారని మండిపడ్డారు. అలాగే బీజేవైఎం మండలాధ్యక్షుడు శ్రీధర్ మద్దతు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని వారిని సముదాయించి ఆందోళన విరమింపజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, దళితులు పాల్గొన్నారు.

**వంటావార్పుతో..**

కొండపాక(గజ్వేల్): దళిత బంధు పథకం అందరికీ వర్తింపచేయాలని కోరుతూ మండల కేంద్రమైన కొండపాకలో దళితులు చేపట్టిన నిరసన కార్యక్రమం మంగళవారం 7వ రోజుకు చేరుకుంది. గ్రామ పంచాయతీ వద్ద వంటావార్పును నిర్వహిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గ్రామానికి 14 దళిత బంధు యూనిట్లు మంజూరయ్యాయంటూ ప్రభుత్వం నుంచి ప్రకటన విడుదల కాగానే స్థానిక ప్రజా ప్రతినిధులు గుట్టు చప్పుడు కాకుండా లబ్ధిదారుల ఎంపికలు జరుగుతున్నాయన్న ప్రచారంతో నిరసన కార్యక్రమాలు చేపట్టామన్నారు. న్యాయం జరిగే వరకు నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు.

**నిర్మల్‌నగర్‌లో..**

మండలంలోని నిర్మల్‌నగర్‌లో దళితుల నిరసన కార్యక్రమాలు కొనసాగుతూనే ఉన్నాయి. మంగళవారం గ్రామ పంచాయతీ వద్ద జాతీయ జెండా ఎగురవేసున్న క్రమంలో దళితులు దళితబంధు మీకేనా అంటూ నిలదీశారు. పక్కనే ఉన్న పోలీసులు వారిని సముదాయించారు. అనంతరం పంచాయతీ కార్యాలయం ఎదుట వంటావార్పుతో నిరసన వ్యక్తం చేశారు. వచ్చిన దళితబంధు అందరికి అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే బీజీవెంకటాపూర్‌లో దళితబంధు విషయంపై స్థానిక ఎంపీటీసీ కిరణ్‌గౌడ్‌కు దళితుల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో ఎంపీటీసీ దళితుడు యాదగిరిపై దాడి చేశారని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



మునిగడపలో ధర్నా చేస్తున్న దళితులు

**రాజగోపాల్‌పేటలో..**

నంగునూరు(సిద్దిపేట): అర్హులైన నిరుపేదలకు దళిత బంధు పథకాన్ని ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రాజగోపాల్‌పేటలో దళిత సంఘం నాయకులు నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని లీడర్లు, వారి అనుచరులను ఎంపిక చేశారన్నారు. కలెక్టర్ స్పందించి విచారణ చేపట్టి అర్హులకు పథకాన్ని వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో ముంద్రాతి లింగం, రమేశ్, మహేశ్, బాలకృష్ణ, రమేశ్, రామచంద్రం, రాము, వీరయ్య, మల్లయ్య, అనిల్ పాల్గొన్నారు.



కొండపాకలో ఆందోళన చేస్తున్న దళితులు

## క్లుప్తంగా

### డిగ్రీ కాలేజీలో బీబీఏ రిటైలింగ్ కోర్సు

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరం నుంచి బీబీఏ రిటైలింగ్ మేనేజ్‌మెంట్ (సెక్టార్ స్కిల్స్ కోర్సు) కోర్సు ప్రభుత్వం ప్రత్యేకంగా 60 సీట్లుతో మంజూరు చేసిందని ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ కోర్సులో చేరే విద్యార్థులకు చదువుతోపాటు అప్రంటీషిప్ (శిక్షణ) ఇప్పిస్తామని పేర్కొన్నారు. కోర్సు పూర్తయితే క్యాంపస్ సెలెక్షన్ ద్వారా ఉద్యోగం వస్తోందని వివరించారు. శిక్షణలో స్టైపెండ్ ప్రభుత్వమే ఇస్తోందని తెలిపారు. ప్రస్తుతం చేరడానికి ఆన్‌లైన్‌లో దోస్త్ ద్వారా ప్రత్యేక ఫేజ్ ఉన్నందని, ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం సూచించారు. వివరాలకు బీబీఏ కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ రాజిరెడ్డి 80089–06990 నంబర్లో సంప్రదించాలని కోరారు.

### కుక్కల బారి నుంచి.. నెమలిని రక్షించిన రైతులు



రేగోడ్: నెమలిని కాపాడిన రైతులు

రేగోడ్(మెదక్): కుక్కల బారీ నుంచి నెమలిని రైతులు కాపాడారు. మంగళవారం మండలంలోని మర్పల్లిలో ఎక్కడి నుంచి వచ్చిన నెమలి నివాస గృహాల మధ్యకు చేరుకుంది. దీనిని చూసిన కుక్కలు వెంబడించి దాడి చేశాయి. అటు నుంచి వస్తున్న రైతులు గొరెడ్డి నారాయణరెడ్డి, దానం సిద్దారెడ్డి గమనించి వాటిని తరిమి రక్షించారు. ఆపై అటవీశాఖ అధికారులకు అప్పగించారు. ఈ సందర్భంగా రైతులను స్థానికులు అభినందించారు.

### ప్రమాదవశాత్తు చెరువులో మునిగి..



సత్తయ్య

చిన్నశంకరంపేట (మెదక్): గేదెలను మేతకు తోలుకు వెళ్లిన రైతు ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని శాలిపేటలో చోటుచేసుకుంది. ఎస్ఐ నారాయణ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నర్ర సత్తయ్య(52) ప్రమాదశాత్తు చెరువులో మునిగి మృతిచెందాడు. సోమవారం సాయంత్రం మేతకు తీసుకెళ్లిన గేదెలు చెరువు దిగాయి. బయటికి తీసుకొస్తూ ప్రమాదశాత్తు చెరువులో మునిగి మృతిచెందాడు. మంగళవారం మృతదేహం పైకి తేలడంతో కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. భార్య సుగుణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



నీటి గుంతలో పడి మృతిచెందిన టాకయ్య

కొమురవెల్లి(సిద్దిపేట): నీటిగుంతలో పడి వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందడంపై కుటుంబీకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ సంఘటన మండలంలోని రసులాబాద్ గ్రామశివారులో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అయినాపూర్‌కు చెందిన మొగుళ్ల టాకయ్య (60) బైక్‌పై మంగళవారం మధ్యాహ్నం సొంత పనిపై కొమురవెల్లికి వెళ్లి వస్తున్నాడు. రసులాబాద్ శివారులోని దాసారం గుట్ట సమీపంలో ఆగి బహిర్భూమికి వెళ్లగా ప్రమాదవశాత్తు కాలు జారి నీటిగుంతలో పడి మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. తండ్రి మృతిపై అనుమానం ఉందని కుమారుడు కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.





సంగారెడ్డిలో హోంమంత్రి మహమూద్‌అలీ చేతులమీదుగా ప్రశంసా పత్రాలు అందుకుంటున్న పోలీసు అధికారులు. కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ శరత్, ఎస్పీ రమణకుమార్ తదితరులు

# క్షయ రహిత తెలంగాణ లక్ష్యం

**ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు**

సిద్దిపేటజోన్ : క్షయ రహిత తెలంగాణ లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా సాగుతోందని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో పతాకావిష్కరణ గావించారు. ఆపై నియోజకవర్గ పరిధిలోని 200 మంది టీబీ బాధితులకు న్యూట్రీషియన్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ వ్యాధి త్వరగా నయం కావాలని సొంత ఖర్చులతో సిద్దిపేటలో కిట్లు అందిస్తున్నామని చెప్పారు. ప్రతి ఒక్కరికీ రూ.800ల విలువైన మందులు నెలనెలా అందిస్తామని భరోసానిచ్చారు. ఇప్పటి వరకు 2,850 మంది టీబీ బాధితులకు కిట్‌లను ఉచితంగా అందించామని స్పష్టం చేశారు. తొలుత పట్టణంలోని 51 మందికి మైనార్టీ బంధు చెక్కులు పంపిణీ చేశారు.

**సిద్దిపేట తెలంగాణకు దిక్సూచి**

సీఎం కేసీఆర్ ఆశీస్సులతో సిద్దిపేట తెలంగాణకు దిక్సూచిగా నిలిచిందని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. టీఎస్‌జీఓ భవన్‌లో 2022–23 విద్యా సంవత్సరంలో పదో తరగతి



విద్యార్థికి కళ్ల కలక నివారణ మందు వేస్తున్న మంత్రి హరీశ్‌రావు

పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. సిద్దిపేట అన్ని రంగాల్లో అగ్రస్థానంలో ఉండటంతోపాటు పదో తరగతి ఫలితాల్లో అగ్రభాగాన ఉందన్నారు. ఐఐఐటీ బాసరలో సిద్దిపేట 70 సీట్లు సాధించిందన్నారు. టెన్త్‌లో 110 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించగా వారికి ఐప్యాడ్‌లు ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం పలు వార్డులలో సీసీ రోడ్ల నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. అనంతరం రావి చెట్టు హనుమాన్ దేవాలయంలోని గోశాలలో ప్రత్యేక పూజలు చేశారు. హరిప్రియ నగర్‌లోని హనుమాన్ దేవాలయంలో వెండి కవచం అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

**కళ్ల కలకలకు మందుల పంపిణీ**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్రవ్యాప్తంగా చిన్నారులకు కళ్ల కలక నిరోధక మందులను ఉచితంగా పంపిణీ చేస్తున్నామని ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. రాష్ట్రంలోనే మొదటిసారిగా ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో కళ్ల కలక నివారణ మందుల పంపిణీని మంగళవారం పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. చిన్నారుల్లో వ్యాధి నిరోధకశక్తిని పెంచేందుకు స్వర్ణప్రాశనాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ కళ్ల కలక నిరోధించడానికి అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని రకాల ఆయింట్మెంట్స్, డ్రాప్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3.8లక్షల మంది చిన్నారులకు ఆయుర్వేద మందులు ప్రభుత్వం పంపిణీ చేస్తోందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, ఆయుష్ కమిషనర్ హరిచందన, హరేరామహరేకృష్ణ ప్రతినిధులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



నియామక పత్రాలను అందిస్తున్న మంత్రి హరీశ్‌రావు

# 29 మంది జేపీఎస్‌ల రెగ్యులర్

**మంత్రి హరీశ్ రావు చేతులమీదుగా నియామక పత్రాల అందజేత**

సిద్దిపేటరూరల్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో 29 మంది జేపీఎస్‌లను గ్రేడ్4 అధికారులుగా ప్రమోషన్ చేస్తూ ఆర్థిక వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా నియామకపత్రాలు అందించారు. కాగా జేపీఎస్‌లు రాధ, ఓబులాపూర్‌కు చెందిన గౌతమ్ సంతోషం వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా 317 జేపీఎస్‌లు ఉన్నారు. ప్రభుత్వం పనితీరును బట్టి రెగ్యులర్ చేసేందుకు ప్రత్యేకంగా 100 మార్కులతో కూడిన ఫార్మాట్‌ను అందించింది. ప్రధానంగా 8 అంశాలైన పల్లెప్రగతి, కరెంట్ బిల్లులు, తడి, పొడి చెత్త, డంపింగ్‌యార్డు, పారిశుధ్యం, వైకుంఠదామం, ట్రాక్టర్ ఈఎంఐలు, జననమరణ రిజిస్టర్‌లు, ఇంటిపన్ను వసూలు, వంటి వాటిపై సెలక్షన్ కమిటీ క్షేత్ర పర్యవేక్షణ చేపట్టింది. ఈ మేరకు మొదటి విడతగా 32 మంది జేపీఎస్‌ల రికార్డులు, పనితీరును క్షేత్ర పరిశీలన చేసింది. మార్కుల ఆధారంగా 29 మంది జేపీఎస్‌లు 70కి పైగా మార్కులు సాధించారు. ముగ్గురు అంత కంటే తక్కువ మార్కులు సాధించారు. దీంతో మొదటి విడతగా 29 మందిని కమిటీ నోడల్ ఆఫీసర్, అదనపు కలెక్టర్ (లోకల్‌బాడీస్) గరిమా అగర్వాల్ ఎంపిక నివేదికను కలెక్టర్‌కు అందించారు. కమిటీ నోడల్ అధికారిగా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్(లోకల్‌బాడీస్) వేరిఫికేషన్ అధికారులుగా సీపీ, ఫారెస్ట్ అధికారులు ఉన్నారు.

# రైతుల్లో సంతోషం నింపారు

- లక్షలోపు రుణమాఫీ చేశారు
- రైతుబంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేవి రవీందర్

కొండపాక(గజ్వేల్): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రవ్యాప్తంగా రూ. 19 వేల కోట్లతో లక్షలోపు వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తున్నట్లు ప్రకటించి రైతుల్లో సంతోషాన్ని నింపారని రైతుబంధు సమితీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దేవి రవీందర్ అన్నారు. రైతు సంక్షేమం కోసం పని చేయడం సీఎం కేసీఆర్‌కే సాధ్యమని పేర్కొన్నారు. ప్రభుత్వం రైతు బీమా ప్రవేశపెట్టి 5 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం లకుడారంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నూనె కుమార్‌తో కలిసి మాట్లాడుతూ, దేశానికి వెన్నెముకగా నిలుస్తున్న రైతన్నల బాగు కోసం గత ప్రభుత్వాలు ఆలోచించిన దాఖలాలు లేవన్నారు.



మాట్లాడుతున్న దేవి రవీందర్

దేశంలోని 29 రాష్ట్రాల్లో రైతుల బాగు కోసం అమలు చేయని పథకాలను తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. సాగు నీటి తిప్పలు రాకుండా మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, రంగనాయక సాగర్‌ల వంటి ప్రాజెక్టులు నిర్మించడంతో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగిందన్నారు. ఈ సందర్భంగా వారు మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కనకయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కరెంట్ షాక్‌తో కౌలు రైతు మృతి

రామాయంపేట(మెదక్): తెగిన సర్వీసు వైరు అతికిస్తుండగా విద్యుత్ షాక్‌తో కౌలురైతు మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని ఝాన్సిలింగాపూర్ గ్రామశివారులో జరిగింది. ఎస్ఐ రంజిత్ కథనం ప్రకారం.. చిన్నశంకరంపేట మండలం ఖాజాపూర్‌కు చెందిన గిరిజన రైతు బుచ్యానాయక్(42)కు అర ఎకరం పొలం ఉంది. రామాయంపేట మండలం అక్కన్నపేటకు చెందిన వ్యక్తి వద్ద మరో 4 ఎకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేస్తున్నాడు. భూమికి సమీపంలో కరెంటు స్తంభాలు లేవు దూరం నుంచి సర్వీస్ వైరు లాగి కనెక్షన్ తీసుకున్నాడు. సాయంత్రం వరి పైరు వద్దకు వచ్చిన అతను తెగిన వైరును అతికిస్తున్న క్రమంలో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. సమీపంలోని వారు ఈ విషయాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు తెలిపారు. వారు అక్కడకు చేరుకొని కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. స్థానిక ట్రాన్స్‌కో ఏఈ పెంట్యానాయక్, ఇతర అధికారులు, పోలీసులు సంఘటనా స్థలిని సందర్శించారు. రాత్రి ఏడున్నర



బుచ్యానాయక్



విలపిస్తున్న కుటుంబసభ్యులు

గంటల ప్రాంతంలో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్ఐ రంజిత్ పేర్కొన్నారు.

### డీఎస్పీకి పీఎంజీ అవార్డు

పటాన్‌చెరు టౌన్: డీఎస్పీ పురుషోత్తం రెడ్డికి పోలీస్ మెడల్ ఫర్ గ్యాలంటరీ(పీఎంజీ) అవార్డు 2023కు గాను 77వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా సోమవారం కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. విధి నిర్వహణలో ఉత్తమ సేవలకు అవార్డును ప్రకటించిందని, దీన్ని కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వానికి పంపనున్నట్లు పురుషోత్తం తెలిపారు.

### ప్రశాంత్‌కు ప్రశంసా పత్రం అందజేత

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరులో ఉన్న 108 అంబులెన్స్ టెక్నీషియన్ ప్రశాంత్ ఉత్తమ ప్రతిభ ప్రశంసా పత్రం సోమవారం అందుకున్నాడు. సంగారెడ్డిలోని హోంమంత్రి మహమూద్ అలీ, పాలనాధికారి శరత్ చేతులు మీదుగా ఈ ప్రశంసా పత్రం అందుకున్నారు.

### ఐదు కిలోల గంజాయి స్వాధీనం

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : ముగ్గురు గంజాయి విక్రేతలను మంగళవారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 5కిలోల గంజాయిని, 3 సెల్ ఫోన్లు, రూ. 25 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఒడిశాకు చెందిన జగబందు, రఘు సోబార్, దూల్‌పేట్‌కు చెందిన జైపాల్‌సింగ్‌కు విక్రయించడానికి రామచంద్రాపురం పరిధిలోని ఇక్రిశాట్ టోల్‌గేట్ సమీపంలోకి చేరుకున్నారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పట్టుకున్నారు. విచారణలో జైపాల్‌సింగ్ వారి నుంచి కిలో గంజాయి రూ.5 వేలకు కొనటానికి సిద్ధమైనట్లు పోలీసులు తెలిపారు. నిందితులను పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

### అధికారంలోకి వస్తే.. రూ.500కే సిలిండర్

**పీసీసీ అధికార ప్రతినిధి కత్తి కార్తీక గౌడ్**

దుబ్బాక: వచ్చే ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి వస్తే గ్యాస్ సిలిండర్ రూ. 500, మహిళలకు రూ. 4 వేల పింఛన్ అమలు చేస్తామని టీపీసీసీ అధికార ప్రతినిధి కత్తి కార్తీక గౌడ్ భరోసానిచ్చారు. మహిళల అభ్యున్నతే లక్ష్యంగా పార్టీ పాటుపడుతోందని అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శక్తి సూపర్ షీ పేరుతో మహిళలతో కలిసి పట్టణంలో మంగళవారం ప్రధాన వీధుల గుండా జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇందిరమ్మ తోబుట్టువు కింద సొంత ఖర్చులతో నియోజకవర్గంలో అప్పుడే పుట్టిన 22 మంది



ర్యాలీలో పాల్గొన్న కత్తి కార్తీక గౌడ్

ఆడ శిశువులకు సంబంధించి ఒక్కొక్కరికీ రూ. 5 వేల చొప్పున పోస్టాఫీస్ ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్‌లు తల్లులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వస్తే ఇందిరమ్మ రాజ్యం వస్తుందని ధీమా వ్యక్తంచేశారు. శ్రీనివాస్‌రావు, దేవిరెడ్డి, జలేందర్‌రెడ్డిపాల్గొన్నారు.

# కేతకీలో సినీనటుల పూజలు



ఆలయంలో సినీ బృందం

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకి సంగమేశ్వర ఆలయంలో.. ప్రేమదేశపు యువరాణి సినీ బృందం సభ్యులు మంగళవారం పూజలు చేశారు. ఆలయ ఆవరణలోని అమృతగుండంలో పాదప్రక్షాళన చేసి, గుండంలోని జల లింగానికి పూజలు చేశారు. అనంతరం గర్భగుడిలోని పార్వతీ పరమేశ్వరులకు అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి మొక్కలు తీర్చారు. ఆలయ అర్చకులు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజీఈ క్రియేషన్స్ ద్వారా రూపొందించిన ఈ సినిమా సెప్టెంబర్ 2న విడుదల చేస్తున్నామని వెల్లడించారు. చిత్రం విజయవంతం కావాలని స్వామిని కోరుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ సాయి సునీల్, హీరోయిన్ ప్రియాంక రేవ్రీ, హీరో యామిన్ రాజ్, నటులు రాజారెడ్డి, బాషా తదితరులు పాల్గొన్నారు.

# దూసుకొచ్చిన మృత్యువు

- బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు
- వ్యక్తి మృతి



దుర్గయ్య

కొల్చారం(నర్సాపూర్): ఎదురుగా వస్తున్న బైకును ఆర్టీసీ బస్సు ఢీ కొన్న ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన మెదక్–నర్సాపూర్ జాతీయ రహదారి జైన్ మందిర్ మలుపు సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ మహమ్మద్ గౌస్ కథనం ప్రకారం.. పాపన్నపేట మండలం గాంధారిపల్లికి చెందిన ఎండుగుల దుర్గయ్య(37) బైక్ పై సోమవారం నర్సాపూర్‌లో నివాసం ఉంటున్న మేనకోడలు వద్దకు వెళ్లాడు. మరుసటి రోజు ఉదయం బైక్‌పై సొంతూరుకు తిరుగు పయనమవుతున్నాడు. జాతీయ రహదారి జైన్ మందిర్ మలుపు వద్ద ఎదురుగా వస్తున్న దుర్గయ్య బైక్‌ను మెదక్ ఆర్టీసీ డిపోకు చెందిన అద్దె బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రోడ్డుపై పడి తలకు తీవ్రగాయమైంది. వెంటనే క్షతగాత్రుడిని మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్న క్రమంలోనే మృతిచెందాడు. మృతుడికి భార్య రేణుక, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.




ప్రమాదస్థలిలో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

**మానవత్వం చాటిన ఎమ్మెల్యే**

మెదక్‌లో స్వాతంత్ర దినోత్సవంలో పాల్గొని కొడిపల్లికి వెళ్తున్న నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి తన కాన్వాయ్‌ను ప్రమాద స్థలంలో ఆపారు. క్షతగాత్రుడిని ఎస్కార్ట్ వాహనంలో మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటారు.

# డబ్బుల కోసం చావుబాదాడు

- కన్నతండ్రిని కడతేర్చిన కుమారుడు
- కొత్తూర్(బి) గ్రామంలో ఘటన



కృష్ణ

జహీరాబాద్ టౌన్: చిల్లర దొంగతనాలకు అలవాటు పడి, తాగుడుకు బానిసై జీతం డబ్బుల కోసం కన్న తండ్రిని చంపాడు ఓ కుమారుడు. ఈ ఉదంతం మండలంలోని కొత్తూర్(బి)లో చోటు చేసుకుంది. సీఐ రాజు కథనం ప్రకారం... గ్రామానికి చెందిన బేగరి కృష్ణ(60), తుల్జమ్మ దంపతులు. ఆయన పారిశుధ్య కార్మికుడిగా పనిచేసేవాడు. కుమారుడు శివకుమార్(22) ఉన్నాడు. అతను తాగుడుకు ఆలవాటు పడి చిల్లర దొంగతనాలు చేస్తూ జులాయిగా తిరుగుతున్నాడు. ఈ క్రమంలో తండ్రి వద్ద ఉన్న రూ. 8 వేల డబ్బుల కోసం రెండు రోజుల నుంచి వేధిస్తున్నాడు. మద్యం తాగి సోమవారం రాత్రి ఇంటికి వచ్చిన అతడు ఈ విషయంలో తల్లిదండ్రులతో గొడవపడ్డాడు. తల్లిపై చేయి చేసుకోవడంతో తన సమీపంలో ఉంటున్న తమ్ముడి ఇంటికి వెళ్లి అక్కడే నిద్రించింది. ఇదే అదనుగా భావించి మంచం కర్ర తీసుకుని తండ్రిని చితకబాదాడు. ఎడమచేతిని విరగగొట్టి పిడుగుద్దులు గుద్దడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. ఉదయం ఇంటికి వచ్చిన తుల్జమ్మ భర్త మృతదేహం చూసి బోరున విలపించింది. జహీరాబాద్ టౌన్ సీఐ, రాజు, జహీరాబాద్ రూరల్ ఎస్ఐ. ప్రసాద్‌రావులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. తల్లి ఫిర్యాదు కేసు నమోదు చేసుకుని శివకుమార్‌ను అరెస్టు చేసి మంగళవారం కోర్టులో రిమాండ్ చేశారు.




నిందితుడు శివకుమార్‌ను చూపిస్తున్న సీఐ రాజు